సాక్షి నల్లగొండ

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



ప్రపంచ దేశాలకు ఆదర్శం..
ప్రపంచ దేశాలకు ఆదర్శంగా సనాతన ధర్మం నిలుస్తోందని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. - 8లో



వెన్నెముక చికిత్సపై వర్క్‌షాప్
బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో వెన్నెముక శస్త్ర చికిత్సపై రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**588.40** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**2,39,978** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**3,22,089** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**32,927** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**9,500** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**3,090** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**2,400** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	**300** క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

నల్లగొండ: నల్లగొండకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రానున్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో జిల్లా అధికారులతో గవర్నర్ సమీక్ష సమావేశం , వివిధ కార్యక్రమాలు ఉన్నందున ప్రజావాణి రద్దు చేశామని.. బాధితులు కలెక్టరేట్‌కు రావద్దని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 22న జరిగే ప్రజావాణికి హాజరు కావాలని సూచించారు.

పోలీస్ గ్రీవెన్స్‌డే కూడా..
నల్లగొండ : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నల్లగొండ పర్యటన నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు ఈ విషయం గమనించి.. ఈ నెల 22న జరిగే పోలీస్ గ్రీవెన్స్‌డేకు హాజరు కావాలని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

చండూరు : విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం చండూరులో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని, విద్యకు కనీసం 25 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు, ఇతర బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ముల్కలపల్లి రాములు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, భరత్, సైదానాయక్, కుంచం కావ్య, బుడిగ వెంకటేష్, కోరె రమేష్, రవీందర్, కిరణ్, నవదీప్, జగన్, జగదీశ్, వీరన్న, సైఫ్, ప్రసన్న, ప్రణీత్, రమేష్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పోరాటంతోనే విముక్తి



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

చిట్యాల : నిజాం, రజాకార్ల దౌర్జన్యాలపై కమ్యూనిస్టు పార్టీలు చేసిన పోరాటంతోనే నాటి తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిందని సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో ఆదివారం వారు అమరవీరులకు నివాళులర్పించి, పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటి పోరాటంలో నాలుగు వేల మంది బలిదానం కాగా పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచామని, మూడు వేల గ్రామాల ప్రజలకు విముక్తి లభిందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, బొజ్జ చినవెంకులు, మల్లం మహేష్, జిట్ట సరోజ, పెంజర్ల సైదులు, రాచకొండ వెంకటేశ్వర్లు, శ్రీను, లింగస్వామి, ఐతరాజు నర్సింహ, నరేష్, యాదయ్య పాల్గొన్నారు.

బుద్ధవనాన్ని సందర్శించిన డిప్యూటీ అకౌంటెంట్ జనరల్

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆదివారం తెలంగాణ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ సంజయ్ కామినేని సందర్శించారు. అంతకుముందు నాగార్జునసాగర్ డ్యామ్‌ను, ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించారు. బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరితవనం, ధ్యానవనం, స్థూపవనాలను సందర్శించి మహాస్థూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలిపే వీడియోను వీక్షించారు. అనంతరం ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించారు. బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర ఆయనను కండువాలతో సత్కరించారు. వీటిని స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం విశేషాలు, చారిత్రక వివరాలను తెలియజేశారు. వీరితో పాటు సీనియర్ ఆడిట్ ఆఫీసర్ బ్రిజేష్ కుమార్, నాగార్జునసాగర్ డ్యాం డివిజన్ కార్యాలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, ఎస్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

స్నాతకోత్సవానికి వేళాయే..



స్నాతకోత్సవానికి ముస్తాబైన ఎంజీయూ ప్రాంగణం

నేడు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వేడుక

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- పీహెచ్‌డీ పట్టాలు అందుకోనున్న 22 మంది విద్యార్థులు
- 57 మందికి బంగారు పతకాలు అందించనున్న గవర్నర్
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన 12 కమిటీలు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవానికి ముస్తాబైంది. ఈ స్నాతకోత్సవాన్ని సోమవారం పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో 12 నిర్వహణ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి. స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐటీ హైదరాబాద్ సంచాలకులు ప్రొఫెసర్ బిఎస్.మూర్తి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఈ స్నాతకోత్సవంలో 22 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందించనున్నారు.

కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ
యూనివర్సిటీ స్నాతకోత్సవం నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఇప్పటికే యూనివర్సిటీని సందర్శించి జిల్లా యంత్రాంగానికి, యూనివర్సిటీల బాధ్యులకు దిశ నిర్దేశం చేశారు. యూనివర్సిటీలోనే వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై గవర్నర్ పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా బాధ్యతలు అప్పగించారు.

గవర్నర్ పర్యటన ఇలా...

- సోమవారం ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్, డీన్స్, ఫ్యాకల్టీస్ సమావేశం జరుగనుంది.
- 10.20 గంటలకు యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జరుగనుంది.
- 10.40 రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్నారు. ఆయనకు వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ స్వాగతం పలుకుతారు.
- 11.10 గంటలకు యూనివర్సిటీలో వైస్ ఛాన్స్‌లర్, అధ్యాపకులతో గవర్నర్ గ్రూప్ ఫొటో దిగుతారు.
- 11.15 గంటలకు గవర్నర్ వేదిక మీదికి రానున్నారు. 11.20 గంటలకు జాతీయ గీతాలాపన చేస్తారు.
- 11.30 విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్ మెడల్స్ అందజేస్తారు.
- మధ్యాహ్నం 12.10 గంటలకు వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ప్రసంగం.
- 12.20 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యార్థును ఉద్దేశించి మాట్లాడతారు.
- 12.30 గంటలకు యూనివర్సిటీ తరఫున సందేశం ఇస్తారు.
- 12.45 కార్యక్రమం ముగింపు సందర్భంగా జాతీయ గీతాలాపన ఉంటుంది.
- 12.50 గంటలకు వేదకమీద నుంచి అతిథులు కిందికి దిగుతారు.



ఎంజీయూ ఆర్చి

పాస్ ఉంటేనే అనుమతి..
స్నాతకోత్సవానికి యూనివర్సిటీలోకి విద్యార్థితో పాటు వారి వెంట కుటుంబ సభ్యుల్లో ఒకరిని లోపలికి అనుమతించనున్నారు. వేదికపై వారికి కేటాయించిన సీట్లలో మాత్రమే అతిథులు ఆసీనులు కావాల్సి ఉంటుంది. యూనివర్సిటీలోకి వెళ్లాలంటే వారికి ఇచ్చిన అనుమతి పత్రం (పాస్) తప్పనిసరిగా ఉండాలి. పాస్ లేకుంటే యూనివర్సిటీ లోపలికి భద్రతా సిబ్బంది అనుమతించరు. లోపలికి వెళ్లే అధ్యాపకులు, ఇతర సిబ్బంది వెంట పిల్లలను, ఫోన్లు, బ్యాగ్‌లు, కెమెరాలను కూడా అనుమతించబోమని పోలీసులు స్పష్టం చేశారు.

ఎంజీ యూనివర్సిటీ వద్ద భారీ బందోబస్తు..
మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ వస్తున్న నేపథ్యంలో పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. యూనివర్సిటీలోని ఆడిటోరియంలో నిర్వహించే స్నాతకోత్సవ ప్రాంతంలో పోలీసులు బాంబు స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. గవర్నర్ పర్యటన సందర్భంగా ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 20 మంది ఎస్సైలు, 100 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యూనివర్సిటీ లోపలికి వెళ్లే వారిని తనిఖీ చేసిన తరువాతనే అనుమతించనున్నారు. పాస్‌లు, గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే స్నాతకోత్సవ వేడుకకు అనుమతిస్తామని ఇప్పటికే ఎస్పీ శరత్‌చంద్రపవార్ స్పష్టం చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన వైస్ చాన్స్‌లర్..
ఎంజీ యూనివర్సిటీ 4వ స్నాతకోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందున యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. ఆదివారం రిజిస్ట్రార్ అలువాల రవితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఆడిటోరియంలో వేదికపైన ఏర్పాట్లకు సంబంధించి నిర్వాహకులకు వీసీ పలు సూచనలు చేశారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.

రైతులకు యూరియా తిప్పలు



యూరియా కోసం తిరుమలగిరి సబ్‌మార్కెట్ యార్డులో బారులుదీరిన రైతులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : యూరియా సమస్య రైతులను వెంటాడుతూనే ఉంది. పంటలు సాగు చేసి నెలల గడుస్తున్నప్పటికీ రైతులకు యూరియా తిప్పలు మాత్రం తప్పడం లేదు. తిరుమలగిరి సాగర్ మండలానికి ప్రత్యేకంగా పీఏసీఎస్ లేకపోవడంలో ఉమ్మడి అనుముల మండలంగానే కొనసాగుతుంది. దీంతో రైతులపై రవాణా ఖర్చు భారం కూడా పడుతోంది. రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులు ఆదివారం తిరుమలగిరి వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డులో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి టోకెన్లు అందించారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు తెల్లవారుజాము నుంచే బారులుదీరారు. తిరుమలగిరి మండలానికి 80మెట్రిక్ టన్నుల యూరియా రాగా డొక్కలబావితండాలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ద్వారా 40మెట్రిక్ టన్నులు, తిరుమలగిరి మార్కెట్ యార్డులో 40మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశారు. రైతుకు రెండు బస్తాల చొప్పున అందించారు.

నృసింహుడి సన్నిధిలో కోలాహలం

యాదగిరిగుట్ట: పంచనారసింహుడు కొలువైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు, మరోవైపు వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో కోలాహలం నెలకొంది. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. గర్భాలయంలో నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఇక ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణ వేడుక, బ్రహ్మోత్సవం, ఆలయ ముఖ మండపంలో అష్టోత్తర పూజలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీలగిరిలో ముస్లింల ర్యాలీ



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలో ఆదివారం మిలాద్ జులూస్ కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ హజరత్ సయ్యద్ షా లతీఫ్ ఉల్లా ఖాద్రి దర్గా మెట్ల దగ్గర నుంచి ప్రారంభమై క్లాక్‌టవర్, ఆర్పీ రోడ్డు, ఓల్డ్ సిటీ చౌరస్తా, గంజ్ ఏరియాల నుంచి తిరిగి దర్గా మెట్ల వరకు సాగింది. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రాగి బిస్కెట్లు, పండ్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, మిలాద్ జులూస్ కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ సల్మాన్ ఖాద్రి, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఫాజిల్, జనరల్ సెక్రటరీ సయ్యద్ ఉబేదుల్లా ఖాద్రి, అడ్వైజర్ ఎం.డీ.కలీమ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంతియాజ్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు జమాల్ ఖాద్రి, అడ్వకేట్ మసియుద్దీన్, అహ్మద్ కలీం, ముజావర్ సమీ ఖాద్రి, సుఫియా ఖాద్రి, తబ రేస్ ఖాద్రి, అవేస్ ఖాద్రి, నసీర్, ఫిరోజ్, ఉమైర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆసనం.. ఆరోగ్యం!



నీలగిరిలో నల్లగొండ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన యోగా పోటీల్లో ఆసనం వేస్తున్న యువతులు

● చెక్కుచెదరలే..



ఆదివారం నాగార్జునసాగర్ 26 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

ఆధునిక దేవాలయంగా పేరుగాంచిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీర్ల పనితనానికి మచ్చుతునక. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ ప్రాజెక్టుకు 1955 డిసెంబర్ 10న శంకుస్థాపన చేయగా 12 సంవత్సరాల్లో పూర్తయింది. మానవ నిర్మితమైన ఈ ప్రాజెక్టుకు పలుమార్లు అంచనాకు మించి వరదలు వచ్చినప్పటికీ గట్టిగా నిలబడింది. సాగర్ ప్రాజెక్టు ఆనాటి ఇంజనీర్ల మేధస్సుకు, ప్రతిభకు తార్కాణంగా నిలుస్తోంది. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక కట్టడాలు నేటికీ చెక్కు చెదరలేదు. నేడు ఇంజనీర్స్ డే సందర్భంగా ఆనాటి కట్టడాలు, ప్రాజెక్టులపై ప్రత్యేక కథనాలు. - 8లో

చేతికొస్తున్న పత్తి

- మొదటి దశ పత్తి తీత పనులు ప్రారంభం
- ఈ ఏడాది అంచనాకు మించి సాగు
- 45 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా



నల్లగొండ మండలంలోని దోమలపల్లిలో పత్తి తీస్తున్న కూలీలతో మాట్లాడుతున్న జిలా వ్యవసాయ అధికారి

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లాలో తెల్ల బంగారమైన పత్తి చేతికొస్తోంది. పత్తి తీత పనులను ఇటీవల రైతులు ప్రారంభించారు. మునుగోడు, చండూరు, నల్లగొండ, మర్రిగూడ, చింతపల్లి, నాంపల్లి, దేవరకొండ, చందంపేట, గుర్రంపోడు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పత్తిసాగు కాగా.. ఈ సారి 45 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనాలు వేస్తోంది. ఈ సారి పత్తి పంట సిరులు కురిపిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అంచనాలకు మించి సాగు..
జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయ శాఖ అంచనాలకు మించి రైతులు పత్తి పెద్ద ఎత్తున సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 5,47,735 ఎకరాల్లో పత్తి సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేయగా అంచనాకు మించి 5,64,585 ఎకరాల్లో రైతులు పత్తి వేశారు. అత్యధికంగా నాంపల్లి మండలంలో 46,959 ఎకరాల్లో, చింతపల్లి 41,375ఎకరాల్లో, మునుగోడులో 39,657 ఎకరాల్లో సాగు చేశారు. ఈ సారి మంచి అదునైన వర్షాలు కురవడంతో రైతులు పత్తి చేలకు 2, 3 దఫాలుగా ఎరువులను పెట్టుకున్నారు. దీంతో పత్తి చేలు ఏపుగా పెరిగి కాయదశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో పెద్ద ఎత్తున ఒక్కో చెట్టుకు 10 నుంచి 20 వరకు కొమ్మలు వచ్చి పెద్ద ఎత్తున కాయలు కాశాయి. వర్షాలు పెద్ద ఎత్తున కురిసిన కారణంగా పత్తి చేలకు చీడపీడలు పెద్దగా ఆశించలేదు.

ఆశాజనకంగా పత్తి చేలు..



జిల్లా అంతటా పత్తి చేలకు మంచి అదునైన వర్షం కురవడంతో చేలు ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉన్నాయి. ఇప్పటికే మొదటి దశ పత్తి తీసే పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పత్తి దిగుబడి ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు వస్తుంది. రైతులకు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి
జిల్లాలో 5,64,585 ఎకరాల్లో పత్తి సాగు కాగా ఎకరాకు సగటున 8 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దీంతో సుమారు 45 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి రానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి మద్దతు ధరను రూ.8,110గా ప్రకటించిన నేపథ్యంలో రైతులకు మంచి ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

సమతుల ఆహారం.. సంపూర్ణ ఆరోగ్యం!

- ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు 'పోషణ మాసం'
- అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహణ
- పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ పోషణ స్థాయిని పెంచడమే లక్ష్యం

మిర్యాలగూడ టౌన్ : మాత శిశు మరణాలను నివారించడంతో పాటు ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా ప్రభుత్వం ×పోషణ మాసం● కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తూ.. పోషణ స్థాయిని పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది.. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పోషణ మాసోత్సవాలు అక్టోబర్ 16వ తేదీనా ముగుస్తాయి. ఈ పోషణ మాసంలో గర్భిణులు, బాలింతలతో సమావేశాలను ఏర్పాటు చేసి పౌష్టికాహారంపై అవగాహన కల్పించనున్నారు. స్వయంగా అంగన్‌వాడీలు తయారు చేసిన పౌష్టికాహారాన్ని వారికి అందించనున్నారు.

పౌష్టికాహారం పంపిణీ
అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇప్పటికే గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు పిల్లలకుపాలు, గుడ్లు, బాలామృతంతో పాటు పలు రకాల పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. అదే విధంగా పిల్లల ఎత్తు, బరువు తీసుకుని వారికి అవసరమైన వైద్య పరీక్షలను చేయిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ఐదేళ్లలోపు పిల్లలకు ప్రాథమిక విద్యతో పాటు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సంపూర్ణ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. నెల 30 గుడ్లు, రోజూ ఒకొక్కరికి 200 మిల్లీలీటర్ల పాలను ఇస్తూ మాతాశిశు ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు.

పోషణ మాసం కార్యక్రమాలు ఇలా

- స్థానిక ఉత్పత్తులు, బొమ్మలు, పౌష్టికాహారం పదార్థాల వినియోగంపై అవగాహన.
- గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల పోషణపై సలహాలు, సూచనలు ఇస్తారు. అనుబంధ ఆహారాల తయారీ, వంటకాల పోటీలు.
- కిశోర బాలికలకు వైద్య పరీక్షలతో పాటు పిల్లల బరువు, ఎత్తు కొలతలను తీయడం, ఆహారంలో చెక్కర, నూనె వినియోగం తగ్గించడంపై అవగాహన.
- చిన్నారుల తండ్రులు, సంరక్షులకు అనుబంధ ఆహారంపై పోటీలు, అదే విధంగా తండ్రులతో పొషకాహారం ప్రతిజ్ఞ. అంగన్‌వాడీ కేంద్రాల్లో కథలు చెప్పడం, బొమ్మల ప్రదర్శన, వాటి ద్వారా ఈసీసీఈ సెషన్, 0- 3 ఏళ్ల పిల్లల ఆరంభ అభివృద్ధి, ప్రేరణ కోసం దృష్టి సారించాల్సిన కార్యక్రమాలు, తల్లిదండ్రులతో చేయించడం.
- పోషణ లోపం ఉన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, ఆకలి పరీక్షలు, గ్రోత్ మానటరింగ్, పిల్లల బరువు, ఎత్తును కొలవడం.



పోషక విలువలతో కూడిన ఆహారం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

అంగన్‌వాడీల వివరాలు..

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	09
అంగన్‌వాడీ కేంద్రాలు	2,093
0నెలల నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు	75,612
గర్భిణులు	8,659
బాలింతలు	6,360

పోషణ స్థాయిని పెంపొందిస్తాం



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే మాతా శిశు మరణాలను తగ్గించవచ్చు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని క్రమ పద్ధతిలో తీసుకుంటే మంచిది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న ప్రాసన, జన్మదిన వేడుకలను కూడా నిర్వహించనున్నాం. పోషణ స్థాయిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం.

– కృష్ణవేణి, జిల్లా సంక్షేమ అధికారిణి, నల్లగొండ

- బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాపడం, పిల్లల అనుబంధ ఆహారంపై అవగాహన.
- ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జీవన శైలిపై అవగాహన.
- స్థానిక వంటకాలు, చిరు ధాన్యాలు, కూరగాయలు, స్వదేశీ బొమ్మల తయారీ.
- పోషణ మిషన్ వంద రోజుల ప్రచారం, గ్రామ, వార్డు సభలు, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ, గృహ సందర్శన, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించడం.

చెక్కుచెదరని కట్టడాలు

● ఉమ్మడి జిల్లాలో ఆనాటి ఇంజనీర్ల ప్రతిభకు అద్దం పడుతున్న నిర్మాణాలు

నేడు ఇంజనీర్స్ డే

నిజాం కాలంలో, దశాబ్దాల క్రితం ఉమ్మడి జిల్లాలో నిర్మించిన పలు సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలు, కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. సరైన సౌకర్యాలు లేని కాలంలో నిర్మితమైన ఈ కట్టడాలు ఆనాటి ఇంజనీర్ల మేధస్సుకు, ప్రతిభకు తార్కాణంగా నిలుస్తున్నాయి. సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా పురాతన కాలం నాటి కట్టడాలు, ప్రాజెక్టులపై ప్రత్యేక కథనం.

వర్షపు నీటిని ఒడిసిపట్టే కనగల్ కత్వ

కనగల్: వర్షపు నీరు వృథా కాకుండా కనగల్ మండల కేంద్రంలో నిజాం కాలంలో కత్వను నాటి ఇంజనీర్లు నిర్మించారు. 1908లో వాగుకు అడ్డంగా 250 మీటర్ల వెడల్పు, 14 ఫీట్ల ఎత్తులో రాతితో ఈ కత్వను నిర్మించారు. కుడి, ఎడమ కాల్వలను ఏర్పాటు చేసి షట్టర్లను అమర్చారు. దీంతో పాటు కత్వ వద్ద నాటి ఇంజనీరింగ్ అధికారులు, కూలీలు, పర్యవేక్షకుల కోసం 2 గోల్ బంగ్లాలను సైతం నిర్మించారు. ఈ బంగ్లాల నుంచి అధికారులు వర్షపాతాన్ని గమనించేవారని అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా కనగల్–దేవరకొండ ప్రధాన రహదారిపై కనగల్ వాగు ఉధృతికి ఇసుక కొట్టుకుపోకుండా ఈ కత్వ నిర్మాణం చేపట్టినట్లు కూడా చెబుతున్నారు. ఇప్పటి వరకు ఈ కత్వ చెక్కుచెదరకుండా నిలవడం నాటి నిర్మాణానికి గుర్తింపుగా నిలిచింది. కత్వ కుడి కాలువ ద్వారా బొమ్మపల్లి చెరువు నిండి హాలియా మండలం మారెపల్లి చెరువుకు నీరు చేరుతుంది. ఎడమ కాలువ ద్వారా శేరిలింగోటం, హాలియా మండలం పులిమామిడి, వెంకటాపురం, నిడమనూరు మండలం ఊట్కూర్ చెరువులకు నీరు చేరుతుంది. వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 7వేల ఎకరాల వరకు సాగు నీరందించడంతో పాటు తాగునీటి సమస్య నుంచి విముక్తి కల్పించేలా నాటి ఇంజనీర్లు కత్వను నిర్మించారు. వరద నీటితో.. ఏఎమ్మార్పీ కాలువల ద్వారా వచ్చే నీటితో గొలుసుకట్ట చెరువుల ద్వారా జలకళ సంతరించుకుంటుంది.


కనగల్ కత్వ

శతాబ్దాల చరిత్రకు సాక్ష్యం శాలిగౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టుకు శతాబ్దాల చరిత్ర ఉంది. 800 ఏళ్ల క్రితం కాకతీయ రాజులు శాలిగౌరారం మండలం వల్లాల గ్రామ శివారు నుంచి ఆకారం, శాలిగౌరారం, గురుజాల వరకు 12 కిలోమీటర్ల పొడవున ఉన్న ఏనెను ఆధారంగా చేసుకొని ఆకారం, శాలిగౌరారం చెరువులను నిర్మించారు. కానీ చెరువుల్లోకి నీరువచ్చేందుకు ఎలాంటి ఏర్పాటు చేయలేదు. నిజాం నవాబులు 1908లో శాలిగౌరారం చెరువును ప్రాజెక్టుగా తీర్చిదిద్దారు. ప్రాజెక్టులోకి నీరు వచ్చేందుకు వీలుగా రామన్నపేట మండలం పల్లివాడ వద్ద మూసీ నదికి అడ్డంగా ఆనకట్టతో పాటు హెడ్‌రెగ్యులేటర్‌ను నిర్మించారు. ఈ హెడ్‌రెగ్యులేటర్ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు వరకు సుమారు 27 కిలోమీటర్ల మేర రాచకాల్వను తవ్వారు.

117 సంవత్సరాలైన చెక్కుచెదరని ప్రాజెక్టు, రాచకాల్వ..

117 సంవత్సరాల తర్వాత కూడా శాలిగౌరారం ప్రాజెక్టు, రాచకాల్వ చెక్కుచెదరలేదు. 1200 ఎకరాల విస్తీర్ణం, 21 అడుగుల నీటి సామర్థ్యం ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు కట్ట పొడవు 3.5 కిలోమీటర్లు ఉంటుంది. ప్రాజెక్టుకు కుడి, ఎడమ తూములను నిర్మించి శాలిగౌరారం మండలంలోని తొమ్మిది గ్రామాల్లోని ఆరువేల ఎకరాలకు సాగునీరందేలా కాల్వలను తవ్వారు. రాచకాల్వలో నీటి ప్రవాహం ఎంత పెరిగినా కట్ట తెగకుండా 10 సర్‌ప్లస్ వియర్స్‌లను నిర్మించారు. అదేవిధంగా పల్లివాడ వద్ద హెడ్‌రెగ్యులేటర్‌తో పాటు తుర్కపల్లి, అమ్మనబోలు వద్ద రెగ్యులేటర్లను నిర్మించారు. ఆయా రెగ్యులేటర్ల వద్ద షట్టర్ల నిర్మాణంతో పాటు ప్రవాహం పెరిగినప్పుడు నీటిని మూసీలోకి దారి మళ్లించేందుకు ఎస్కేప్ రెగ్యులేటర్లను కూడా నిర్మించారు. రాచకాల్వకు ఒకవైపున మాత్రమే కట్ట ఉండటం విశేషం. ప్రాజెక్టు, రాచకాల్వపై ఉన్న రాతి కట్టడాలన్నీ డంగుసున్నంతో నిర్మించినవి కావడం గమనార్హం. శాలిగౌరారం ప్రాజెక్టుకు 40 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. రాచకాల్వకు అనుసంధానంగా శాలిగౌరారం ప్రాజెక్టుతో పాటు 24 చెరువులు, కుంటలు ఉన్నాయి.


శాలిగౌరారం ప్రాజెక్టు

దీర్ఘ దృష్టితో ప్రాజెక్టుల నిర్మాణం



దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా శాలిగౌరారం ప్రాజెక్టు, రాచకాల్వ నిర్మాణం చేపట్టారు. 117 సంవత్సరాలు గడిచినా నేటికీ ప్రాజెక్టు, రాచకాల్వ చెక్కుచెదరకపోవడానికి కారణం నాటి ఇంజనీర్ల ముందుచూపే. భవిష్యత్‌లో ఎన్ని అవాంతరాలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా ప్రాజెక్టుల నిర్మాణాలు పటిష్టంగా ఉండేలా ప్రణాళికలను రూపొందించుకోవడమే ఇంజనీరింగ్ విధానం.

– సత్యనారాయణ, ఇరిగేషన్ ఈఈ, శాలిగౌరారం ప్రాజెక్టు, తిరుమలగిరి డివిజన్

రాతి గోడలతో రాజకోట



రాతితో నిర్మించిన రాజకోట ప్రహరీ

రాజాపేట: రాజాపేట మండల కేంద్రంలో 250 ఏళ్ల క్రితం రాజుల కాలంలో నిర్మించిన రాజకోట ఇన్నేళ్లవుతున్నా చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. రాజరాయన్న 1775లో ఈ రాజకోటను రాతి గోడలతో నిర్మిచారు. అప్పటి నిజాం పాలకులు సంస్థాన్ నారాయణపురం, సంస్థాన్ రాజాపేట కోటను కేంద్రంగా ఏర్పాటు చేసుకుని పరిపాలించారు. ప్రజా పాలన కోసం తమ రక్షణ కోసం అప్పటి శాస్త్రీయ పద్ధతిలో ఈ కోటను శత్రుదుర్భేద్యంగా నిర్మించారు. ఇందుకుగాను డంగుసున్నంతో పెద్దపెద్ద రాళ్లతో కోటగోడలు నిర్మించారు. ఈ రాజకోట బురుజులు, ఎత్తైన ప్రాకారాలతో ఉంది. శత్రువులు రాకుండా కందకాల్లో మొసళ్లను పెంచేవిధంగా సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామం చుట్టూ ఒక పద్ధతిగా కందకాలను ఏర్పాటు చేశారు.

సజీవంగా నాటి సంస్థానం ఆనవాళ్లు


చెక్కుచెదరకుండా ఉన్న ఎత్తైన రాతి ద్వారం

సంస్థాన్ నారాయణపురం: నిజాం కాలంలోని పరిగణాలలో సంస్థాన్ నారాయణపురం ఒకటి. సంస్థాన్ నారాయణపురం సంస్థానం 18వ శతాబ్దం నుంచి ప్రారంభమైంది. సుమారు 300 సంవత్సరాలు క్రితం నిర్మించిన కట్టడాలు నేటికీ సజీవంగా కనిపిస్తున్నాయి. నారాయణరెడ్డి అనే వ్యక్తి ఈ సంస్థానాన్ని పాలించడంతో ఆయన పేరు మీదుగానే సంస్థాన్ నారాయణపురం పేరు వచ్చింది. సంస్థాన్ నారాయణపురం చుట్టూ ఎత్తైన ప్రహరీ, దాని పక్కన శత్రువుల నుంచి రక్షణ పొందడానికి పెద్ద కందకం ఏర్పాటు చేశారు. నాలుగు దిక్కుల్లో నాలుగు దర్వాజలున్నాయి. ఉత్తరం వైపున రెండు బురుజుల మధ్యన ప్రధాన ద్వారం ఉంది. రెండు గుట్టలపై సంస్థానం రక్షణ కోసం బురుజులు నిర్మించారు. మరో గుట్టపై ఫలక్‌నుమా ప్యాలెస్ అనే సుందరమైన కట్టడం ఉంది. ఈ ప్యాలెస్‌లో రాజు–రాణి విశ్రాంతి తీసుకునే వారని, అంతేకాకుండా హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా ప్యాలెస్ కూడా సంస్థాన్ నారాయణపురం రాణి వారసులకు చెందినదని అనే కథనాలున్నాయి. ఆ కాలంలో నిర్మించిన ప్రహరీ, కందకాలు, రెండు దర్వాజలు, ప్యాలెస్ కొంత మేర శిథిలావస్థకు చేరినప్పటికీ కొన్ని కట్టడాలు నేటికీ చెక్కుచెదరలేదు.


గుట్టపై గల ఫలక్‌నుమా ప్యాలెస్

కింద వాగు.. పైన సాగర్ ఎడమ కాల్వ


వాగుపై నుంచి ప్రవహిస్తున్న సాగర్ ఎడమ కాల్వ


హాలియా వాగుపై నిర్మించిన ఆక్వెడక్ట్

హాలియా: నాటి ఇంజనీర్ల మదిలో పుట్టిన ఎన్నో అపురూపమైన కట్టడాలల్లో మచ్చుకకు కొన్ని మన కళ్ల ఎదుట సాక్షాత్కరిస్తున్నాయి. వాటిలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అహల్య(హాలియా) వాగుపై నిర్మించిన ఆక్వెడక్ట్ నిర్మాణం ఒకటి. సాగర్ ఎడమ కాల్వ నిర్మాణ సమయంలో 1955–60 మధ్య కాలంలో హాలియా వాగుపై రాతితో ఈ ఆక్వెడక్ట్‌ను నిర్మించారు. ఆక్వెడక్ట్ అనేది కాల్వ నీటిని సహజ వాగులు, నదులు లేదా లోయల మీదుగా తీసుకెళ్లడానికి చేపట్టిన నిర్మాణం. హాలియా వాగుపై సుమారు 600 మీటర్ల పొడవు, 24 రాతి (కానాలు) పిల్లర్లతో పెద్ద బ్రిడ్జిని ఏర్పాటు చేసి దాని పైభాగంలో సాగర్ ఎడమ కాల్వ నీరు ప్రవహించేలా, కింది నుంచి హాలియా వాగు ప్రవహించేలా ఈ ఆక్వెడక్ట్‌ను నిర్మించారు. 24 పెద్ద రాతి గోడలను హాలియా వాగులో నిర్మించి దానిపై బ్రిడ్జి కట్టి ఆ పైభాగంలో సుమారు 25 ఫీట్ల ఎత్తులో కాల్వ ఉండేలా డిజైన్ చేశారు. యూ ఆకారంలో దీని నిర్మాణం చేపట్టి సాగర్ ఎడమ కాల్వ నీటి ప్రవాహం వేగంగా వెళ్లేగా నాటి ఇంజనీర్లు రూపకల్పన చేశారు. కింది భాగంలో ఉన్న హాలియా వాగు ఎగువ నుంచి వచ్చే వరదతో వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో ఈ బ్రిడ్జి పర్యాటకులను ఆకట్టుకుంటుంది.

ఇంజనీర్ల మేధోశక్తికి తార్కాణం 'ఆసిఫ్‌నహర్'


రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం చెరువు వద్ద ఆసిఫ్‌నహర్ కాల్వపై ఏర్పాటు చేసిన తూము

రామన్నపేట/వలిగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఆసిఫ్‌నహర్ కాలువ ప్రధానమైనది. ఈ కాలువ ద్వారా వలిగొండ, రామన్నపేట, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నల్లగొండ మండలాలలోని 15,245 ఎకరాలకు సాగునీరు అందుతుంది. నిజాం రాజు ఆసిఫ్ అలీ 1903లో ఈ కాలువ తవ్వకాన్ని ప్రారంభించి 1906లో పూర్తిచేశాడు. నహర్ అనగా ఉర్దూలో కాలువ అని అర్థం. ఈ కాలవను ఆసిఫ్ అలీ కాలంలో నిర్మించడంతో ఆసిఫ్‌నహర్ అనే పేరు వచ్చింది. ఆసిఫ్‌నహర్ కాలువ యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నెమిలికాల్వ వద్ద ప్రారంభమవుతుంది. ఇక్కడ మూసీ నదిపై కత్వను ఏర్పాటుచేసి డిస్ట్రిబ్యూటరీని ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కాలువ సామర్థ్యం 397క్యూసెక్కులు. కాలువ పొడవు 100కిలోమీటర్లు. ఇందులో సుమారు 13కి.మీ. కాలువ సహజ సిద్ధంగా ఉంది. కాలువ ద్వారా 21 పెద్ద చెరువులను, 32 చిన్న చెరువులను నింపడం జరుగుతుంది. కాలువ వెంట 135 తూములు, 15కత్వలు, 30వంతెనలు ఏర్పాటు చేశారు. నెమిలి కాల్వ కత్వ నుంచి నీళ్లు నేరుగా ఇంద్రపాలనగరం చెరువులోకి వస్తాయి. అక్కడి నుండి తూముల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తారు. పన్నెండు దశాబ్దాలు దాటినా ఆసిఫ్‌నహర్ కాలువ పటిష్టంగా ఉండడం ఆనాటి ఇంజనీర్ల పనితీరుకు అద్దం పడుతోంది. ఆనాటి ఇంజనీర్లు కత్వలతో పాటు రెగ్యులేటరీలు, వంతెనలు, చెరువులు, కాలువలు, తూముల నిర్మాణానికి పూర్తిగా రాతిని ఉపయోగించారు. తక్కువ ఖర్చు, తక్కువ శ్రమతో సహజ సిద్ధంగా కాలువలో నీరు పారేలా అప్పటి ఇంజనీర్లు డిజైన్ చేశారు. కాలువలో పూడికతీత, గుర్రపుడెక్క ఆకు తొలగింపు, గండ్లు పూడ్చివేత పనులు మినహా రెగ్యులరీలు, తూములకు వందేళ్ల కాలంలో చేసిన మరమ్మతులు చాలా తక్కువ.


నీటి కరువు తీర్చిన నిజాం చీఫ్ ఇంజనీర్


డిండి ప్రాజెక్టు

డిండి: డిండి ప్రాజెక్టు నిజాం కాలంలో నిర్మించబడి నేటికీ వేల ఎకరాలకు సాగునీరందిస్తోంది. కృష్ణా నదికి ఉపనది అయిన దుందుబి నది పరివాహక ప్రాంతంలో సాగు, తాగు నీటి కష్టాలను దూరం చేయాలనే ఆలోచన నిజాం కాలం నాటి చీఫ్ ఇంజనీర్ ఖాజా అజీమొద్దీన్ మదిలో మెదిలింది. దీంతో దుందుబి వాగు ద్వారా వృథాగాపోతున్న నీటిని నిల్వ చేసేందుకు ప్రాజెక్టును నిర్మించాలని ఆయన అప్పటి నిజాం రాజు దృష్టికి తీసుకెళ్లారు. అజీమొద్దీన్ ఇంజనీరింగ్ ప్రతిభతో 1940–43 మధ్య కాలంలో రూ.34.36 లక్షలు ఖర్చుచేసి హైదరాబాద్–శ్రీశైలం వెళ్లే మార్గంలో డిండి మండల కేంద్రంలో పెద్ద పెద్ద బండరాళ్లు, గచ్చుతోటి ప్రాజెక్టును నిర్మించారు. అప్పటి నుంచి వర్షాధారంపైనే ఆధారపడి నిండుతున్న ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ఎడమ కాలువ ద్వారా 12500, కుడి కాలువ ద్వారా 250 ఎకరాల ఆయకట్టు సాగుకు నీరందిస్తోంది. డిండి ప్రాజెక్టు పూర్తికాగా మిగిలిన డబ్బుతో డిండి మండల కేంద్రానికి దాదాపు 8 కిలోమీటర్ల దూరంలో డిండి నుంచి దేవరకొండకు వెళ్లే మార్గంలో బాపన్‌కుంట వద్ద అజీంఘడ్ అనే కోటను కూడా నిర్మించారు. ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్న కోట అందాలను చూసేందుకు నిత్యం వస్తున్న పర్యాటకులు వస్తుంటారు.

ఆధునిక దేవాలయం.. సాగర్

నాగార్జునసాగర్: ఆధునిక దేవాలయంగా పేరుగాంచిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్వదేశీ ఇంజనీర్ల పనితనానికి మచ్చుతునకగా నిలుస్తోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించబడింది. 1955 డిసెంబర్ 10న ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయగా 12 సంవత్సరాలలో ఓ కొలిక్కి వచ్చింది. 45వేల మంది శ్రామికులు 24గంటలు పనిచేసి సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఎద్దుల బండ్లలో రాళ్లను తీసుకొచ్చి డ్యాం వద్దకు చేర్చేవారు. ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే రాతి నిర్మించిన కట్టడాలలో ఒకటి. 1967లో ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. అనంతరం 1974లో క్రస్ట్ గేట్ల నిర్మాణం పూర్తయ్యింది. ఆనాటి ఇంజనీర్లు ఎలాంటి లాభాపేక్ష లేకుండా దేశ అభివృద్ధి కోసం పనిచేసేవారని రిటైర్ ఇంజనీర్లు తెలిపారు. నేడు ఉన్నంత సాంకేతిక పరిజ్ఞానం, మిషనరీ ఆనాడు లేవు. కనీసం సమాచారాన్ని అందిపుచ్చుకోవడానికి కూడా నేడున్నన్ని సమాచార సాధనాలు లేవు. అయినా ఆనాటి ఇంజనీర్ల బలమైన కోరిక ప్రాజెక్టును సకాలంలో అంచనా వ్యయం కన్నా తక్కువ వ్యయంతో పూర్తిచేశారు. 590 అడుగుల ఎత్తులో ఈ ప్రాజెక్టుండగా.. 110 చదరపు మైళ్ల విస్తీర్ణంలో నీరు నిలబడి ఉంటుంది. ప్రాజెక్టు 408 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం కల్గి ఉండేలా నిర్మించారు. కాలక్రమేణా పూడిక నిండటంతో ప్రస్తుతం 312 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. ప్రాజెక్టు నిర్మాణం అనంతరం పలుమార్లు అంచనాకు మించి వరదలు వచ్చినప్పటికీ సాగర్ ప్రాజెక్టు నిలబడింది. స్పిల్‌వే మీదుగా 2009లో 14లక్షల క్యూసెక్కులకు మించి నీటిని విడుదల చేశారు.


నాగార్జునసాగర్ ప్రాజెక్టు


డ్యాం నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన పరంజాలు (ఫైల్)

అద్భుతం.. కాల్వ నిర్మాణం


దోసపహాడ్ గ్రామంలో మూసీ నదిపై నిర్మించిన సాగర్ ఎడమ కాల్వ

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామ శివారులో మూసీ నదిపై సాగర్ ఎడమ కాల్వ నిర్మాణం ఇంజనీర్ల అద్భుతమైన ప్రతిభకు గొప్ప నిదర్శనం. సాధారణంగా నదిపై ఆనకట్ట కట్టి నీటిని నిల్వ చేస్తారు. కానీ ఇక్కడ నదిపై నుంచి కాల్వ ప్రవహించేలా ఇంజనీర్లు నిర్మాణం చేపట్టారు. 1955–60 మధ్యన మూసీ నది పైనుంచి 50 అడుగుల ఎత్తులో 32 కానాలతో సాగర్ కాలవను రాతి కట్టడంతో నిర్మించారు. దీని ద్వారా సాగర్ నుంచి వచ్చే నీరు మూసీ నదిపై ఎలాంటి అటంకాలు లేకుండా ప్రవహించేలా చేశారు. వంతెన కింది నుంచి మూసీ నీరు ప్రవహిస్తుంది. సాగర్ కాల్వ నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు సాగునీరు అందిస్తుంది. ఇంజనీర్ల దూరదృష్టి, నైపుణ్యం, పట్టుదలకు ఈ కట్టడం సాక్ష్యంగా నిలిచింది.

ఎయిమ్స్‌లో వెన్నెముక శస్త్రచికిత్సపై వర్క్‌షాప్

బీబీనగర్: బీబీనగర్ మండలంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో వెన్నుముక శస్త్రచికిత్సపై వైద్య విద్యార్థులకు రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. శనివారం వెన్నెముక సర్జరీ చేసే విధానంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి రిషికేష్ మాట్లాడుతూ.. వెన్నెముక సర్జరీలో ఆధునిక చికిత్స విధానాలపై, ఎండోస్కోపీ పద్ధతులపై వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆర్థోపెడిక్ సర్జరీలపై వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డీన్ నితిన్ అశోక్‌జాన్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ ఆరోరా, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ మహేశ్వర్ లక్కిరెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శంగా సనాతన ధర్మం

● మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: ప్రపంచ దేశాలకు ఆదర్శంగా సనాతన ధర్మం నిలుస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో సనాతన ధర్మ పరిరక్షణ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సనాతన ధర్మంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో ఎన్నో ఏళ్లుగా సనాతన ధర్మం విరాజిల్లుతుందని కొనియాడారు. దేశ నలుమూల నుంచి వచ్చిన స్వామీజీలు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కాషాయానికి విలువ పెరుగుతుందని, మహా కుంభమేళాలో 15కోట్ల మంది హిందువులు పాల్గొన్నారని కొనియాడారు. హిందువుల్లో ఐక్యత లేక సనాతన ధర్మం సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువులు సనాతన ధర్మం కోసం కృషి చేయాలన్నారు. ఇతర మతస్తుల దాడులను ఎదుర్కొనేందుకు ప్రతి హిందువు సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ బీరెల్లి చంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, సుధాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, జాతీయ స్వామీజీ, పీఠాధిపతి సాధువుల అధ్యక్షుడు అంబికేశ్వరానంద స్వామీజీ, కక్కిరేని చంద్రశేఖర్, రాచర్ల కమలాకర్, ఈగ దయాకర్, బ్రాహ్మణపల్లి మురళీధర్, నూకా వెంకటేశంగుప్తా తదితరులు పాల్గొన్నారు.



జగదీష్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

నకిలీ జామీను పత్రాలు సృష్టిస్తున్న ఇద్దరి అరెస్ట్

భువనగిరిటౌన్ : నకిలీ జామీను పత్రాలు తయారుచేస్తున్న ఇద్దరు వ్యక్తులను భువనగిరి పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం పోలేనుగూడెం గ్రామానికి చెందిన తిరుగమల్ల సోమయ్య, ఖమ్మంకు చెందిన సింగిరెడ్డి విజయ్‌భూపాల్‌రెడ్డి కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శుల పేరిట నకిలీ రబ్బరు స్టాంపులు తయారుచేసి నల్లగొండలోని ఓ ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఖాళీ ఇంటి టాక్స్ రశీదు పుస్తకాలు, విలువైన ఆస్తి పత్రాలు సేకరించారు. నకిలీ ఆధార్ కార్డులు ఉపయోగిస్తూ నకిలీ డాక్యుమెంట్స్ రూపొందించి నిందితులకు స్వయంగా జామీను ఇవ్వడం, సీజ్ అయిన వాహనాల విడుదలకు నకిలీ డాక్యుమెంట్స్ అందజేస్తున్నారు. ఇందు కోసం ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.300 వరకు వసూలు చేస్తున్నారు. పక్కా సమాచారం మేరకు వారిద్దరిని శుక్రవారం రాత్రి భువనగిరిలోని లాడ్జిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నకిలీ రబ్బర్ స్టాంపులు, డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇప్పటివరకు 24 నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించినట్లు పోలీసులు విచారణలో తేలింది. వారిద్దరిని శనివారం రాత్రి కోర్టులో హాజరుపర్చి న్యాయమూర్తి ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు తరలించారు.


నిందితులు వీరే..


స్వాధీనం చేసుకున్న రబ్బరు స్టాంపులు

అప్పల బాధతో రైతు ఆత్మహత్య


రవీందర్‌రెడ్డి (ఫైల్)

చిలుకూరు: అప్పుల బాధ తట్టుకోలేక మనస్తాపంకు గురైన రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామంలో జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జెర్రిపోతుగూడెం గ్రామానికి తానం రవీందర్‌రెడ్డి(42) గతంలో ఫైనాన్స్ నడిపించేవాడు. ఫైనాన్స్‌లో ఇబ్బందులు రావడంతో కొంతకాలంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల గ్రామంలో రూ.60లక్షలతో కొత్త ఇల్లు నిర్మించాడు. మూడు నెలల క్రితం గృహ ప్రవేశం కూడా చేశాడు. ఇంటి నిర్మాణం కోసం తీసుకొచ్చిన అప్పులతో ఇబ్బందులు పడుతున్నాడు. అప్పు ఇచ్చిన కొంత మందికి సోమవారం తిరిగి చెల్లిస్తానని చెప్పినట్లుగా తెలిసింది. దీంతో వాళ్లకు డబ్బులు ఎలా ఇవ్వాలో తెలియక మనస్తాపానికి గురై ఆదివారం మధ్యాహ్నం ఇంటి వద్ద నుంచి గడ్డి మందు తీసుకొని పొలానికి వెళ్లాడు. అక్కడ గడ్డి మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

నల్లగొండ: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు మృతిచెందారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి నల్లగొండ పట్టణంలోని పానగల్ బైపాస్ వద్ద దత్తసాయి కాలనీ సమీపంలో జరిగింది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ జి. మానస తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కేఎస్ఆర్ కన్సల్టెంట్ కార్మికులు తన్మయ్ (28), బాపన్ సర్దార్ పానగల్ బైపాస్‌లోని దత్తసాయి కాలనీలో ఓ సైట్ ఇంజనీర్ వద్ద వాటర్ ట్యాంకు పనులు చేయడానికి కాంట్రాక్టుకు కుదిరారు. ట్యాంకు పనులు చేస్తూ అక్కడే మరికొంత మంది కార్మికులతో ఉంటున్నారు. వారిద్దరు బైక్‌పై శనివారం అర్ధరాత్రి మిర్యాలగూడ నుంచి నల్లగొండకు వస్తుండగా.. దత్తసాయికాలనీ సమీపంలోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న తన్మయ్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న బాపన్ సర్దార్ రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో అటుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం బాపన్ సర్దార్ కాళ్ల పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాపన్ సర్దార్‌ను 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. బుక్యా నాగేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి. మానస తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

నల్లగొండ: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్లు చెరువులో జరగగా.. ఆదివారం ఉదయం మృతదేహం లభ్యమైంది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ సైదులు తెలిపిన ప్రకారం.. మాడ్గులపల్లి మండలం గజలాపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు సింగం యాదగిరి(37) కొంతకాలంగా నల్లగొండ పట్టణంలోని బీటీఎస్‌లో నివాసముంటున్నాడు. నల్లగొండ పట్టణ సమీపంలోని పానగల్లు చెరువులో చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు యాదగిరి, అతడి కుమారుడు వరుణ్‌తేజ్‌తో కలిసి చేపలు పట్టేందుకు పానగల్లు చెరువు వద్దకు వెళ్లారు. చెరువు కట్టపై వరుణ్‌తేజ్‌ను కూర్చొబెట్టి చేపలు పట్టేందుకు యాదగిరి వల తీసుకుని తెప్పపై చెరువులోకి వెళ్లాడు. చేపలు పడుతుండగా ఒక్కసారిగా వర్షం కురిసి బలమైన గాలి వీయడంతో తెప్ప తిరగబడి యాదగిరి చెరువులో మునిగి గల్లంతయ్యాడు. అతడి కుమారుడు వరుణ్‌తేజ్ గమనించి అక్కడున్న వారికి విషయం చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చెరువు వద్దకు చేరుకుని యాదగిరి ఆచూకీ కోసం ఎంత గాలించినా దొరకలేదు. ఆదివారం ఉదయం జాలర్ల సాయంతో వెతకగా యాదగిరి మృతదేహం దొరికింది. యాదగిరి భార్య సత్యవతి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు టూటౌన్ ఎస్ఐ తెలిపారు.